క్లుప్తంగా

ఉచిత బీమా సౌకర్యం కల్పించాలి



మూలకొత్తూరులో మాట్లాడుతున్న శ్రీరాం, దేముదునాయుడు

రాంబిల్లి : గొర్రెలు, మేకలు పెంపకందారులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.దేముదునాయుడు కోరారు. మూలకొత్తూరులో శనివారం గొర్రెలు, మేకలు పెంపకందారుల సమావేశాన్ని నిర్వహించారు. గొర్రెలు, మేకలు పెంపకందారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని దేముదునాయుడు కోరారు. కార్యక్రమంలో ఉరిటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు చర్యలు

మునగపాక : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మండల ప్రత్యేకాధికారి మంజుల వాణి పేర్కొన్నారు. లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. మండలంలోని గణపర్తి, చూచుకొండ లే-ఆవుట్‌లను హౌసింగ్ డే లో భాగంగా సందర్శించారు.ఈ సందర్భంగా లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమయ్యే సాయం అందజేస్తామన్నారు. ఎంపీడీవో రవికుమార్, సర్పంచ్‌లు చదరం నాయుడు, దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థం

రాంబిల్లి: చినకలవలాపల్లి గ్రామంలో శనివారం సీతారాముల తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్ల వంటి కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఉపాధి పనుల్లో మహిళకు గాయాలు

కోటవురట్ల: బోడపాలెంలో ఉపాధి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా కాలు జారి సిహెచ్.సత్యవతి అనే మహిళ గాయపడింది. సహచరులు ఇచ్చిన సమాచారంతో సర్పంచ్ సింగంపల్లి ఎరుకునాయుడు అక్కడకు చేరుకుని గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఏపీవో గంగునాయుడుకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

చీడిక కొత్తూరులో యువకుడి వీరవిహారం



యువకుడిని కట్టివేసిన స్థానికులు

నక్కపల్లి: మండలంలో చీడిక కొత్తూరులో శనివారం ఒక యువకుడు వీర విహారం చేశాడు. కత్తితో పలువురిని గాయపరచడంతో గ్రామస్తులు అతన్ని పట్టుకుని తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు. జార్ఖండ్‌లోని బోల్‌బుగల్ గ్రామానికి చెందిన సోకెల అస్త అనే యువకుడు గుల్లిపాడు రైల్వేస్టేషన్‌లో ఉదయం రైలు దిగాడు. చీడిక కొత్తూరు చేరుకుని గ్రామంలో పలువురిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో గ్రామస్తులు అతన్ని తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు. అతని మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఈ విధంగా ప్రవర్తించినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా వుండాలి

పాయకరావుపేట: యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం అందరూ కృషి చేయాలని సీఐ పి.అప్పలరాజు అన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా కృషి చేయాలని పట్టణంలో కళాశాలల వద్ద కటౌట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎస్.రమేష్, బి.జోగారావు, ఏఎస్ఐ గోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

బార్క్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): తంతడి గ్రామానికి చెందిన బార్క్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని శనివారం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథ్‌ను తంతడి వాసులు కలిసి వినతి పత్రం అందజేశారు.

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సువర్ణపాలన

యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న సువర్ణ పాలన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు రాజు) అన్నారు. యలమంచిలి తులసీనగర్ సచివాలయం పరిధిలో ఉలక్‌పేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో అమలౌతున్న పథకాల లబ్ధిని ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. యలమంచిలి మున్సిపాలిటీలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందుతున్నాయని, పేదల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరలోనే తీరనుందని, అండర్ గ్రౌండ్ డ్రైయినేజి ద్వారా మురుగు నీటిని శుద్ధి చేసి మంచి నీటిని ఇతర అవసరాలకు పరిశ్రమలకు సరఫరా చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి యలమంచిలి మున్సిపాలిటీకి అధిక నిధులు మంజూరు చేశారని అన్నారు. జగనన్న గృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలని సూచించారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ సక్రమంగా సేవలందిస్తే ప్రజల ఆశీస్సులు పొందగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వివరించాలి

రాంబిల్లి : జగనన్న అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వివరించి అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) అన్నారు. పంచదార్ల, రాంబిల్లి తుపాను రక్షిత భవనాల్లో శనివారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. మండల సచివాలయ కన్వీనర్‌గా వాడనర్సాపురానికి చెందిన కొవిరి రామకృష్ణ ఎంపికయ్యారు. రామకృష్ణను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మరోసారి జగనన్నను సీఎం చేసేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కృషిచేయాలన్నారు. పార్టీ పరిశీలకుడు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ ప్రతి పక్షాలకు ప్రజాదరణ లేదన్నారు. సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్‌రాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు డీఎస్ఎన్ రాజు(బుజ్జి) పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కన్నబాబురాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామకృష్ణ

మాఘ పౌర్ణమి జాతరకు ఏర్పాట్లు



రేవుపోలవరంలో జాతర జరిగే ప్రదేశం



బందోబస్తుకు వచ్చిన పోలీసులు

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో మాఘ పౌర్ణమి జాతరకు ఏర్పాట్లు చేసినట్టు ఎస్ఐ ప్రసాద్ రావు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామునుంచి జరిగే జాతరకు నక్కపల్లి నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో 130 మంది పోలీసులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఇందులో ఇద్దరు సీఐలు, 8 మంది ఎస్ఐలు, 40 మంది మహిళా కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, హోమ్‌గార్డ్స్, సచివాలయాల్లో మహిళా పోలీసులు కూడా విధుల్లో ఉంటారని చెప్పారు. శనివారం నక్కపల్లి సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న బందోబస్తు సిబ్బందికి డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచనలు ఇచ్చారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తగా ఉండాలన్నారు. కాగా తీరంలో మాఘపౌర్ణమి పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ రామ్మూర్తిరాజు తెలిపారు.



పూడిమడక జాతరలో స్టాల్స్, విద్యుత్ సెట్టింగ్‌లు

36 ప్రత్యేక బస్సులు

నర్సీపట్నం డిపో పరిధిలో 36 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు డిపో మేనేజర్ చెప్పారు. ఇందులో కొన్ని నర్సీపట్నం, డిపో బస్సులు కాగా, మరికొన్ని గాజువాక, సింహాచలం బస్సులు నడపనున్నట్టు డిపో మేనేజర్ ధీరజ్ చెప్పారు.

సందడిగా మొదలైన మాఘ మాస జాతర

అచ్యుతాపురం(అనకాపల్లి): మాఘ మాస జాతర ఘనంగా మొదలైంది. అనకాపల్లి జిల్లాలోని అతి పెద్ద తీర ప్రాంతమైన పూడిమడకలో జాతర మహోత్సవం సందడిగా మొదలైంది. రాత్రంతా జాగారం ఉండి, తెల్లవారు జాము నుంచి స్నానాలు ఆచరించనున్నారు. హైస్కూల్ జంక్షన్ నుంచి విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. పలు స్టాల్స్‌తో తీర ప్రాంతం ఉత్సాహ వాతావరణంలో కనిపించింది. ఆదివారం తెల్లవారు జాము నుంచి సముద్రపు స్నానాలు ఆచరించి, జగన్నాథ స్వామి వారిని దర్శించుకోనున్నారు.

క్యాన్సర్ పట్ల అవగాహన అవసరం



ఎస్.రాయవరంలో క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు శక్తి ప్రియ

ఎస్.రాయవరం : క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ఎస్.శక్తి ప్రియ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ డే పురస్కరించుకుని సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో 8 సచివాలయాల్లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, నిత్యం మనం తీసుకునే ఆహారం పోషకాలతో కూడినదై ఉండాలన్నారు. పొగ తాగడం, గుట్కా వంటి అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. మరికొన్ని సచివాలయాల్లో పీహెచ్‌సీ రెండవ వైద్యాధికారి ఎస్.వాసంతి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లష్టర్ పర్యవేక్షకులు ప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆయా గ్రామాల ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వలంటీర్ సేవాభావం



విమ్స్‌లో చికిత్స పొందుతున్న అప్పలనాయుడుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శిరీష

మునగపాక : తోటాడ వలంటీర్ ద్రాక్షారపు శిరీష మానవత్వం చాటుకున్నారు. తన విధి నిర్వహణలో భాగంగా మెరుగైన సేవలందించారు. తోటాడ పంచాయతీకి చెందిన మళ్ల అప్పలనాయుడు ఆరోగ్యం బాగోలేకపోవడంతో విశాఖలోని విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో వలంటీర్ ద్రాక్షారపు శిరీష తన విధి నిర్వహణలో భాగంగా శనివారం విశాఖలో చికిత్స పొందుతున్న అప్పలనాయుడుకు ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛన్ సొమ్ము అందజేశారు. వలంటీర్ శిరీష సేవల పట్ల సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్, దొడ్డి బాలాజీ, పంచాయతీ కార్యదర్శి శ్రీ లక్ష్మి, ఆర్‌బీకే కన్వీనర్ బొడ్డేడ శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావాలి

కోటవురట్ల: వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులను మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ కోరారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా అన్నవరం గ్రామంలోని లే అవుట్‌ను హౌసింగ్ బృందం శనివారం పరిశీలించింది. అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకుని ఇంటి నిర్మాణాలను ప్రారంభించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రత్యేకాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అన్నవరం లే అవుట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, అధికారులు

ఇంటి పన్నులపై దృష్టి సారించండి



రికార్డులు పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్

పాయకరావుపేట : గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. ఎస్.నర్సాపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసారు. గ్రామంలో ఇంటి పన్నులు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్యం లోపం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రత పై దృష్టి సారించాలన్నారు. అనంతరం చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించి సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

ఘనంగా మహానేత రాజశేఖరరెడ్డి తీర్థ మహోత్సవం

మునగపాక: మండలంలోని కొత్త నాగవరంలో శనివారం మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ మహానేత రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి రాజన్న ఎంతో కృషి చేశారన్నారు. రాజశేఖరరెడ్డి హయాంలో అమలైన పథకాలతో పాటు నేడు ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలన్నారు. మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఈ తీర్థ మహోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు వెంకట్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



రాజన్న విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, పార్టీ నాయకులు

తూర్పు కాపు సంక్షేమ భవన నిర్మాణానికి భూమిపూజ

మునగపాక : మునగపాక మండలాన్ని అభివృద్ధి పథంలో పయనించేలా ప్రతి ఒక్కరూ సహకారాన్ని అందించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. ఉమ్మలాడ గ్రామంలో ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు సొంత నిధులతో తూర్పుకాపు సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. దీంతో భవన నిర్మాణానికి ఎంపీపీ జయలక్ష్మి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి రమణమూర్తిరాజు సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ, ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి, దళిత విభాగం మండల అధ్యక్షుడు మందా రాము, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మొల్లేటి వినోద్, మొల్లేటి నారాయణరావు, సూరిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తూర్పుకాపు సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

బాషా మృతి కళారంగానికి తీరని లోటు

మునగపాక : కళాకారుడు షేక్ బాషా మృతి కళారంగానికి తీరని లోటని గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మునగపాక సాంబశివుని కల్యాణమండపం వద్ద బాషా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఎంతో మంది కళాకారులకు ఉపాధి కల్పించడంతో పాటు కళలను ప్రోత్సహించే బాషా మృతి తీరని లోటుగా అభివర్ణించారు. బాషా కుటుంబానికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బోడకుర్తి గణేష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, దేవస్థానం చైర్మన్ బూడిద శ్రీనివాసరావు, దాడి సాంబశివ, కోరుకొండ సూర్యనారాయణ,శరగడం జగన్,బొడ్డేడ ప్రసాద్,షేక్ నాగూర్,షేక్ రసూల్,షేక్ శివజన్ పాల్గొన్నారు.



కళాకారుడు బాషా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎంపీడీవోను సన్మానించిన పాలకవర్గం

నక్కపల్లి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఎంపీడీవో అవార్డు అందుకున్న సీతారామరాజును నక్కపల్లి మండల పరిషత్ పాలకవర్గం శనివారం ఘనంగా సన్మానించింది. ప్రజా సమస్యలపై సత్వరం స్పందిస్తూ పాలకవర్గాన్ని అధికారులను సమన్వయం చేస్తూ విధులు నిర్వహిస్తున్న సీతారామరాజుకు అవార్డు రావడం ఆనందంగా ఉందని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అన్నారు. పాలకవర్గం సహాయంతో మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేస్తానని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీలు నానాజీ ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, సీనియర్ నాయకులు మణిరాజు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఎంపీడీవోను సన్మానిస్తున్న పాలకవర్గం

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యుల వాగ్వాదం

కోటవురట్ల : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సభ్యుల వాగ్వాదాలతో వాడి వేడీగా సాగింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన ఈ సమావేశం జరగగా జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి శాఖల వారీ సమీక్ష చేశారు. అయితే సమావేశం ఆరంభంలో టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పుట్రేవు సూర్యారావు అధికారులను ప్రశ్నించగా వైస్ ఎంపీపీ ఆర్.ఎస్. సీతారామరాజు అడ్డుతగిలి హాజరు రిజిస్టర్‌లో సంతకం చేయని వారు ప్రశ్నించడానికి అవకాశం లేదన్నారు. దాంతో సూర్యారావు కల్పించుకుని సంతకం సమావేశం చివరలో కూడా పెట్టవచ్చని వాగ్వాదానికి దిగారు. దాంతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబుతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీకి చెందిన సభ్యులు సూర్యారావుతో వాగ్వాదానికి దిగి సంతకం పెట్టకుండా సమీక్షలో పాల్గొనడానికి వీల్లేదన్నారు. దాంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వైస్ ఎంపీపీ సీతారామరాజు ఇద్దరినీ సముదాయించి సమావేశాన్ని కొనసాగించారు. ఆర్‌డబ్ల్యుఎస్‌కు సంబంధించి రాజుపేట గ్రామంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల కోసం సుమారు రూ.70 లక్షలు కేటాయించారని, ఆ నిధుల్లో కొన్ని నిధులను కొత్త ట్యాంకు నిర్మాణానికి వినియోగించాలని సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ కోరారు. చౌడువాడలో చెరువు పనులు చేపట్టడానికి రైతులు అడ్డుపడుతున్నారని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గోపాలకృష్ణ కోరారు. ధాన్యం కొనుగోలులో కోటవురట్ల మండలం వెనకబడి ఉందని, వ్యవసాయ శాఖ సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎంపీటీసీ పుట్రేవు సూర్యారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పలు గ్రామాలలో రీసర్వే జరుగుతోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జానకమ్మ సూచించారు. చినబొడ్డేపల్లి సర్పంచ్ పైల శివరామ్ కల్పించుకుని తమ గ్రామంలో 23 ఎకరాల గెడ్డ పోరంబోకు స్థలానికి ఓ వ్యక్తికి పట్టాలిచ్చేశారని, దీనిపై గతంలో ఫిర్యాదు చేయగా నేటికీ విచారణ చేయలేదని ఆరోపించారు. డిజిటల్ సైన్ చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు. రెండో వైస్ ఎంపీపీ చక్కా సుజాత, ఎంపీడీవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యం

- ఆరోపించిన సభ్యులు
- వాడీవేడిగా మండల సమావేశం

నక్కపల్లి : మండలంలో వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉందని పలువురు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పెదతీనార్ల, చినతీనార్ల ఎంపీటీసీలు నాగేశ్వరరావు, వాసపల్ల అప్పలస్వామి తదితరులు మాట్లాడుతూ సర్వే సిబ్బంది ఎఫ్‌లైన్ పిటీషన్లు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కలెక్టర్ ఆదేశించినప్పటికీ చినదొడ్డిగల్లు బద్దివీధిలో సర్వే చేసి ఆక్రమణలు తొలగించడానికి మార్కింగ్ ఇవ్వడం లేదన్నారు. చినతీనార్ల, వేంపాడులలలో ఉన్న చెరువులతో పాటు, పలు ప్రాంతాల్లో కొండల నుంచి గ్రావెల్ అక్రమంగా తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వేంపాడు అప్పలరాజు చెరువులో మట్టిని తవ్వేసి సమీపంలో ఉన్న లేఅవుట్లలో వేస్తున్నారని ఈ విషయంపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉద్దండపురం గొడిచర్లలో జేజేఎం పనుల కోసం రోడ్లు తవ్వేసి తిరిగి పూడ్చడం లేదన్నారు. రైతుల నుంచి సేకరించిన బియ్యంలో తేమ ఎక్కువగా ఉందంటూ మిల్లర్లు రైతులకు సకాలంలో డబ్బులు ఇవ్వడం లేదని ఉద్దండపురం సర్పంచ్ పొడగట్ల వెంకటేష్ సమావేశంలో ప్రస్తావించారు. గృహనిర్మాణ శాఖ పనితీరు కూడా బాగా లేదన్నారు. వైస్ ఎంపీపీ నానాజీ మాట్లాడుతూ బిల్లులు సకాలంలో అందడం లేదన్నారు. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే వారితో డీపీఆర్‌లు సకాలంలో తయారు చేయడం లేదన్నారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పెదతీనార్లలో మూడేళ్ల క్రితం మంజూరు చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పూర్తి చేయలేదని సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో సిబ్బందిని నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

ఘనంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

మునగపాక : మునగపాకలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవకమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, గౌరవ అధ్యక్షుడు పాలిమేర అప్పలనాయుడు,కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు తగు చర్యలు తీసుకున్నారు. ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబురాజు), గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తదితరులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, నేల వేషాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎస్ఐ మహమ్మద్ ఆలీ బందోబస్తు నిర్వహించారు.



గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు,గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

పాయకరావుపేట: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. శ్రీరాంపురం గ్రామంలో పి.ఎం.డి.ఎస్ పద్ధతిలో వ్యవసాయ సాగు పై రైతులకు వివరించారు. తొల కరికి ముందు ప్రిమోన్ సూన్ డ్రై సోలింగ్ అనే ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 365 రోజులు భూమిని కప్పి వుంచే విధానంలో వేసిన 30 రకాల విత్తనాలను జల్లగా వచ్చిన మొక్కలను కట్ చేసి పశువులకు ఆహారంగా వేయాలన్నారు. ఈ ఆహారం తినడం వల్ల పాల దిగుబడి పెరుగుతుందన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది